# పంకజం తెచ్చిన పంకిలం

ఎండ మండిపోతోంది; తల మాడి పోతోంది; బుర్ర వేడెక్కింది. మెదడు మొద్దు బారింది; దారి కనిపించదు – అగమ్యగోచరం అనిపిస్తుంది యావత్తూ. తనేం చేశాడు? ఏ పాపం చేశాడు తను? ఎందుకోసం యీ శిక్ష? ఏమో అంతా అనిశ్చిత నిశ్చితం!

ఏమీలేదు; తను జీవితంలో సుఖంగా ఎడ్జెస్ట్ అవుదామనుకున్నాడు. జీవితంతో కాంప్రొమైజ్ కోసం చూచాడు. కాని యీనాడు, ఆశలు అడియాసలై తలచిందీ వలచిందీ తారుమారై – యీ నడిరోడ్డున, ఎండకు వొళ్ళంతా మండిపోతూండగా – ఎటూ తోచక ఏమీ కానక నించున్నాడు తను. ఏడాదికిందట, అవును సరీగ్గా పన్నెండు నెలల కిందట – తనస్థానం ఎంత హుందాగావుంది! ఏమిటివాళ తను యెందుకూ పనికి రానివాడై పోవటానికి కారణం? సుఖాన్ని కోరుకోటం తప్పా? అందరూ కోరేదీ,యావజ్జీవమూ ప్రయత్నం చేసేదీ, ఎందుకోసం. ఊరికే – సుఖంకోసం – కదా మరి!

వేదాంతిఅయిపోతున్నాడు తను, అనిపిస్తోంది. ఈ ప్రపంచం అంతా క్షుద్రం, యిందులో ఏదీ నిజం కాదు. ఏదీ అబద్ధంకాదు, ఏదీ మంచి కాదు, ఏదీ చెడ్డకాదు, ఏదీ ఏదీకాదు. అస్పష్టంగా, అగమ్యగోచరంగా – పిలిస్తే కరవొచ్చేట్లు ఎందుకిట్లా తయారైనాడు తను? ఎవరు యిందుకు దోహదించారు? పంకజం?

పంకిలంలోంచి పంకజం బయలుదేరుతుంది కాని ---- పంకజంతో కూడా పంకిలం ఉంటుందని తనకి తోచలేదు; తోస్తే అట్లా చేసివుండేవాడు కాదు. కథ యిట్లా

వెలితలు తిరిగేది కాదు. ఏ మంత్రశక్తికో తను బానిసై పోయినాడు. ఏ తపశ్శక్తో తనని విడిసి కొడుతుంది; అవునా? ఏం తెలుసు తనకి?

ఒక్కడే కొడుకు. అన్నిటికీ అందుబాటు. అందరిలో పలుకుబడి. అన్నీ ఆనందం. అందుకే అయింది తనబతుకిట్లా - ----- అనిపిస్తుంది. యిప్పుడు అనిపిస్తుంది కాని ------ ఏం అయింది తన బ్రతుకుకీ? హాయిగా, చక్కటి ఉద్యోగం. చదివింది తక్కువే అయినా------ పూర్వీకులపుణ్యమా అంటూ సంతకం పెడుతూ కూర్చునే ఉద్యోగం, రెండొందలజీతం తనకొక్కడికీ! ఏం కావాలి యింతకంటే జీవితంలో? ఎవరు మాత్రం యింతకంటే స్వర్గాలని వేరే కోరుకుంటారు? ---- అనిపించింది. కాని సుఖం అంటే ఏమిటి? ఎందుకోసం అది. అన్నీ ప్రశ్నలు. ఈ జీవితానికి ఆదీ అంతం పుణ్యం పురుషార్థం ప్రయోజనం పరితాపం అన్నీ ప్రశ్నలే ఎవరికీ జవాబు దొరకని ప్రశ్నలు. జీవితమే ఒక పెద్దప్రశ్న---- తనలాటివాడికి. కోరికలకి అర్థాలు తెలియని వాళ్ళకీ కోరికలు ఎందుకోసమో అర్థం చేసుకోలేని వాళ్లకీ అవి ఎక్కడ ఆగిపోతే ఆనందంగా వుంటుందో తోచనివాళ్ళకి జీవితం అంతాఇంతే! ఇట్లా దరిదాపులేని మధనమే!

తన జీవితంలో పంకజం ఎవరు? పంకజానికి తనెవరు? ఎన్నోవాడు? యిట్లా మమకారం లేకుండా అనురాగం అవసరంలేకుండా పెరిగే అనుబంధాలు ఎందుకోసం? ఎవరిని ఉద్ధరించను? ఎవరిని అడుగుతాడు తను ఇవన్నీ? అసలు తనా ఊళ్ళో ఎందుకు బసచెయ్యాలి? చేసినా ఆ హోటల్లో ఎందుకు? చేసినా హృదయాన్ని ఎందుకు కంట్రోల్ చేసుకోలేక పోవాలి? సరిగా ఆరాత్రే పంకజం ------ తన కోసరమే ఉదయించినట్టుగా అప్పుడే అక్కడికి ఎందుకు రావాలి? ఇదంతా ఎప్పుడో పూర్వమే రాసి పడేసుందంటారు. నిజమేనా?

ఎలక్ట్రిక్ లైట్ కాంతిలో పెదవులు వణికిపోతూ పంకజం తనకి కథ చెబుతుంటే; నమ్మకుండా వుండటం ఎలానో చేత కాలేదు తనకి. ఎక్కడోపుట్టింది; ఎక్కడో పెరిగింది; ఇక్కడికిట్లా చేరుకుంది. ఎవరూలేరు, ఆనందిచేవాళ్ళు, అవసరాలు అడిగేవాళ్ళు; తీర్చటానికి ప్రయత్నించేవాళ్ళు, 'ఎవరైనా దగ్గరికి తీస్తానంటే ------ వెంటనే వొప్పుకొని యావజ్జీవం బానిసలా పడుంటాను. కాస్త వి శ్రాంతిగా కాలం వెళ్ళమారుస్తాను ------' అంది. ఆ అవకాశం యెవరికో ఎందుకివ్వాలి?

పంకజం లాంటి దివ్యసుందర విగ్రహం... మోకాలెందుకడ్డాలి? తెలివి తక్కువ కాకపోతే--- అనిపించింది. అంతే దగ్గరికి తీసుకున్నాడు.

కాలం మధురంగా గడచి పోయింది. లోకం మనోహరంగా అనిపించింది. కాని ఎంతో కాలం కాదు. రోజులు ఎదురు తిరిగాయి, కాలం వెడిసి కొట్టింది. మనుషుల వర్తనాలు మారిపోయినాయి.

పంకజం తనతో ఒకనాడు యేమన్నది? నాయిష్టంవచ్చినట్లు చేస్తాను. నువ్వెందుకు నన్ను ఊరికే బాధపెడతావు? తనకు యిష్టం అంటూలేదా? పంకజం తన యిష్టాన్ని ప్రతిబింబించదా? ఏమిటీ విభిన్నత?

రానురాను పంకజం తనని అసహ్యించుకుంటుందని తను కల కనలేదు. కాగా – కాలం యేం నిరూపించింది? పంకజం నిజమైన పంకజం కాదు! వెనక బోలెడంత కథ వుంది. అనాడు తను నమ్మిందీ చేరదీయటానికి దోహదించిందీ శుద్ధ అబద్ధం అని తేలిపోయింది. పంకజానికి తను శతంభీష్మం లాంటివాడు.

మానవత్వంలో నమ్మకం మాసి పోయింది; ఎవరినీ నమ్మరాదు; ఎవరినీ దగ్గరికి తీయరాదు. ఎవరితోనూ హృదయం విప్పి మాట్లాడరాదు; ఎట్లా వొంటరిగా ఉంటాడు తను? ఎట్లా సాధ్యం అవుతుంది?

పంకజం తన జీవితంలో ప్రవేశించి దారుణమైన మార్పులు తీసుకొచ్చింది కద! తల్లి దండ్రులకి దూరం అయినాడు. అయినవాళ్ళకు కాని వాడైనాడు. హితులకు అహితుడైనాడు. ఇంతాచేసి ఆర్నెల్లుకద! పంకజానికి తనకీ యేమీ సంబంధం లేదు– అయినవాళ్ళంతా తనని క్షమించరు. తననిప్పుడు తమ పక్కన సహించలేరు.

తనకి ఉభయ భ్రష్టత్వం వచ్చింది; ఇటు తల్లినీ తండ్రినీ చూచుకుంటూ ఉండే యోగ్యత పోయింది; అటు పంకజాన్ని చూచుకునే అవసరమూ తీరిపోయింది.

నిక్షేపంలాంటి ఉద్యోగంకాస్తా వూడి పోయింది. తనూ తన విషాదమూ, పొడుగైన బజార్లూ, దుమ్ము లేచేరోడ్లూ మిగిలాయి.

ఏమీ దిక్కుతోచక – యిట్లా – ఆకాశం వంక చూస్తో కాలం మింగేస్తున్నాడు తను. పగలు సూర్యుడు: ఎండ మండి పోతోంది – రాత్రి చంద్రుడు: చలి ఎముకలు కొరుకుతోంది. తను మాత్రం అన్నిటికీ అతీతుడు. ఇట్లా చూస్తూనే నిరాదరణ సహిస్తూనే – నిర్వికార నిరంజనుడిలా గాలిలో నించున్నాడు. దేదీప్యమానంగా వెలిగి పోతాడు తను. అపుడు యిప్పుడు ఎవరూ ఎవరికీ ఏమీకారు. తనుమాత్రం – బాధలు భరిస్తాడు. భయాలు వెనక్కి నెడతాడు; అట్లానే నించుంటాడు; నించున్నంతకాలం చూస్తుంటాడు.

❃

(తెలుగు స్వతంత్ర 23-4-1954)